

పతకాలు సాధించిన విద్యార్థులు

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చార్మినార్ చాలెంజ్ ఖేలో హైదరాబాద్ అథ్లెటిక్ చాంపియన్ షిప్-2024 పోటీల్లో షేక్‌పేట దర్గాలోని గంగోత్రి స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన ఈ క్రీడల్లో రన్నింగ్‌లో ఆరుగురు విద్యార్థులు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కన్నానాయుడు తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సర్వేశ్వర్‌రెడ్డి, పీఈటీ బి. రమేష్ పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అండర్-10 200 మీటర్స్ రన్నింగ్‌లో 4వ తరగతికి చెందిన అంకిత్ కుమార్ మూడో స్థానంలో గెలుపొందగా, అండర్-11 విభాగంలో 100 మీటర్ల రన్నింగ్‌లో 6వ తరగతికి చెందిన ఎ.ప్రవీణ్ కుమార్, అండర్-12 కేటగిరిలో 100 మీటర్ల రన్నింగ్‌లో 5వ తరగతి విద్యార్థి కె.ధరహాస్, 6వ తరగతికి చెందిన డి.భగత్ చంద్ర, వి. సంతోష్, ఎ. ప్రవీణ్ పతకాలు సాధించినట్లు తెలిపారు. పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొనగా ఆరు పతకాలు సాధించినట్లు వారు తెలిపారు.



విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

- కార్పొరేటర్ విజయారెడ్డి

బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి విజయారెడ్డి అన్నారు. పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆమె సోమవారం బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ కళాశాలతో అన్ని రంగాల్లో పోటీ పడుతున్నాయన్నారు. ఆర్థికంగా వెనకపడిన విద్యార్థులకు చేయూతనందించి ప్రోత్సహించేందుకు పీజేఆర్ ఫౌండేషన్ ద్వారా బ్యాగులు, పుస్తకాలు అందచేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పించే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దన్‌రాజ్‌రాథోడ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశంలో అంతరించిపోతున్న ఆస్ట్రో ఆసియాటిక్ భాషలు

- ఆ భాషలు మాట్లాడే ఆదివాసీ తెగలపై ఇండో యూరోపియన్ భాషల ప్రభావం
- పారిశ్రామికీకరణ, వలసలే ఇందుకు కారణం
- సీసీఎంబీ తాజా అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, జూలై 22: మన దేశంలో ఆస్ట్రో ఆసియాటిక్ (దక్షిణాసియా దేశాల ప్రజల మూల భాషలు) భాషలను మాట్లాడే ఆదివాసీ తెగలు క్రమంగా ఇండో-యూరోపియన్ (అస్సామీ, బెంగాలీ, కొంకణీ) భాషల వైపు మొగ్గుచూపుతున్నాయని సీసీఎంబీ నిర్వహించిన జన్యు-భాషాపరమైన అధ్యయనంలో వెల్లడైంది. ఒడిశా, చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని ఆదివాసీ తెగలతో పాటు మన దేశంలో దాదాపు 5% మంది ప్రజలు ఆస్ట్రో ఆసియాటిక్ భాషలను మాట్లాడుతారు. దాదాపు 4వేల సంవత్సరాలుగా వీరి భాషలివే. అయితే, క్రమంగా ఈ తెగలపై ఇండో-యూరోపియన్ భాషల ప్రభావం పెరుగుతున్నట్లు సీసీఎంబీ వెల్లడించింది.

పారిశ్రామికీకరణ, వలసలు ఇందుకు కారణాలుగా పేర్కొంది. ఈ ధోరణి వల్ల ఆస్ట్రో ఆసియాటిక్ భాష మాట్లాడేవారు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఒడిశాలోని భతూడి, భుమ్జి, హో, మహాలీ ఆదివాసీ తెగలు మాట్లాడే భాషలో వస్తున్న మార్పులపై సీసీఎంబీ శాస్త్రవేత్త కుమారసామి తంగరాజ్, లక్నోలోని బీర్బల్ సాహ్ని ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త నీరజ్‌రాయ్ తాజాగా అధ్యయనం నిర్వహించారు.

ఆస్ట్రో ఆసియాటిక్ భాష మాట్లాడే తెగలకు చెందినవారు, ఆ తెగలకు సమీపంలోనే ఉంటూ ఇండో-యూరోపియన్ భాష మాట్లాడే వారి జన్యువులను సరిపోల్చి చూశారు. వీరిద్దరి మధ్య జన్యుభేదం ఉందని నిర్ధారణ అయిందని తంగరాజ్ తెలిపారు. జన్యువులు, భాషకు గల సంబంధంపై సీసీఎంబీ అధ్యయనం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ అధ్యయనం అంతర్జాతీయ జర్నల్ హేలియాన్‌లో ప్రచురితమైంది.

దోచుకోవడానికే మూసీ సుందరీకరణ

- భద్రాచలం మాత్రమే కాదు మొత్తం తెలంగాణే మునగబోతున్నది
- రౌండ్ టేబుల్ సమావేశంలో పాశం యాదగిరి, గాదె ఇన్నయ్య

పంజాగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన నాయకులు ప్రస్తుతం రాష్ట్ర విభజన ఒప్పంద చట్టం అమలుపై సమీక్ష చేస్తున్నారని, పది సంవత్సరాల ఉమ్మడి రాజధాని అంశం ముగిసిన తరువాత తెలంగాణపై ఆధిపత్యం కోసం కొత్త నాటకానికి తెరలేపారని సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య ఆరోపించారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే పాలమూరు- రంగారెడ్డి పథకం కాకుండా, దోచుకోవడానికే రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంశాన్ని ముందుకు తెస్తున్నారన్నారు. పోలవరంతో భద్రాచలం మునగడమే కాదు, వీరి వలన మొత్తం తెలంగాణ మునుగబోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విభజన ఒప్పంద చట్టం... కుట్ర- ఆధిపత్యంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. విభజన వలన ఏడు మండలాలు ఏపీకి వెళ్లాయని, పోలవరం వలన భద్రాచలం కాదు తెలంగాణ మునుగబోతుందనే ఆందోళన వక్తం చేశారు. ఏడు మండలాలు అడగాల్సింది పోయి ఐదు గ్రామాలు కావాలని అడగడం విడ్డురంగా ఉందన్నారు. కార్యక్రమంలో పి.శ్రీశైల్ రెడ్డి, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ, న్యాయవాది చంద్రశేఖర్, అరుణ, సుశీలా రెడ్డి, నిఖిల్, శభాజ్, ఎం.ఏ షాహిద్‌లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు విద్య పేరిట దోచుకుంటున్నాయి

బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్య పేరిట దోచుకుంటున్నాయని డీఈఓకు సోమవారం జూబ్లీహిల్స్ టీడీపీ నాయకుడు సలీం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిలింనగర్ 18 బస్తీల్లో పేద, మధ్య తరగతి వారు నివసిస్తున్నారని తెలిపారు. కొంత మంది చదువు మెరుగ్గా రావాలని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తుండగా వారు ఫీజులు పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. క్రీడా మైదానం, మరుగుదొడ్లు లేకున్నా ఫీజు మాత్రం భారీగా తీసుకుంటున్నారని, ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జవహర్‌నగర్‌కు చెందిన బి. రేఖ ప్రైవేటు కంపెనీలో హౌస్ కీపింగ్‌గా పనిచేస్తుంది. ఈ నెల 21న విధులు ముగించుకొని ఇందిరానగర్ రోడ్డులో నడుచుకుంటూ వెళుతుండగా ఓ వ్యక్తి హఠాత్తుగా ఎదురుపడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె అరవడంతో స్థానికులు అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభయహస్తం దరఖాస్తులు మళ్లీ షురూ

- ఖైరతాబాద్ జోన్‌లో ఒక్కరోజే 845 దరఖాస్తులరాక

ఖైరతాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ముందు ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తులు తీసుకోగా వాటిని పథకాల వారీగా విభజించి ఆన్‌లైన్ చేశారు. అందులో ఇప్పటికే కొంత మందికి గ్యాస్ సబ్సిడీ కోసం మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారికి జీరో బిల్లులు వస్తుండగా మరికొందరు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో వారికి పథకాలు అమలు కావడంలేదు. ఎన్నికల కోడ్ రావడంతో దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయింది. దీంతో చాలా మంది తమకు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అందడం లేదని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సిఉందని సాగదీశారు. అభయహస్తం దరఖాస్తులను మళ్లీ స్వీకరిస్తుండడంతో ఆయా కార్యాలయాల వద్ద జనాలు బారులు తీరుతున్నారు.

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో..

జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో సోమవారం ఒక్కరోజే 845 అభయహస్తం దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల అనంతరం ఇటీవల ప్రారంభమైన కౌంటర్ల ద్వారా ఇప్పటివరకు 2435 దరఖాస్తులు అందాయి. అందులో సర్కిల్-17 పరిధిలో ఖైరతాబాద్ డివిజన్‌కు గాను వార్డు కార్యాలయం శాఖా మైదానంలో, సోమాజిగుడ డివిజన్ వార్డు కార్యాలయం పంజాగుట్ట ఆఫీసర్స్ కాలనీలోని జలమండలి కార్యాలయం వద్ద,



ఖైరతాబాద్ మునిసిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు తీసుకుంటున్న సిబ్బంది

అమీర్‌పేట డివిజన్‌కు గాను ఎస్‌ఆర్‌నగర్‌లోని బీకెగుడ వార్డు కార్యాలయంలో, సనత్‌నగర్ డివిజన్‌కు నెహ్రూ పార్క్‌లోని వార్డు కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సర్కిల్-18 జూబ్లీహిల్స్ పరిధిలోని వెంకటేశ్వరకాలని, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్ల దరఖాస్తులను ఖైరతాబాద్ మునిసిపల్ కార్యాలయంలో తీసుకుంటుండగా షేక్‌పేట డివిజన్ దరఖాస్తులను షేక్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తీసేకుఉంటున్నట్లు అధికారులు తెలిపారు. కొత్తగా దరఖాస్తులు సమర్పించేవారు గతంలో సమర్పించిన వాటిలో పొరపాట్లు ఉన్నవారు తమ ఆధారాలను తిరిగి ఆయా సెంటర్లలో అందించవచ్చును.



డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సినారె పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయులను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. సోమవారం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి 93వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు డా.సినారె పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి లక్ష్మీప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సినారె పురస్కారాన్ని ఆచార్య యార్లగడ్డకు అందజేయడం సముచితమైన నిర్ణయమని అన్నారు. తెలుగు భాష, సాంస్కృతిక వ్యాప్తికి సినారె, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ వేణుగోపాలచారి, ఎం.కె.రాము, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 కార్యాలయం పక్కన రహదారిని అందుబాటులోకి తేవాలి

పంజాగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్ నుంచి జానకమ్మతోట మీదుగా యూసఫ్‌గూడ బస్తీకి వచ్చే రహదారికి ఇటీవల మరమ్మతు పనులు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 కార్యాలయం పక్కనే రహదారి దెబ్బతినడంతో కొత్తగా సీసీ రోడ్డు వేశారు. రహదారి వేసి నెల రోజులు అవుతున్నా దానిని ప్రారంభించడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల తీరుకు నిరసనగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీపీఎం నాయకులు సోమవారం అక్కడ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రహదారిని తెరిచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. నెల రోజుల నుంచి యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ కార్యదర్శి రాపర్తి అశోక్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్.చంద్రశేఖర రావు, వై.యాదగిరి, పి.కృష్ణ పుల్లయ్య, రమణ, రమేష్ కుమార్ పాల్గొన్నారు.



ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఉపకమిషనర్లు, అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఆస్తిపన్ను, శానిటేషన్‌లపై ప్రత్యేక సమావేశం

- డెంగీ నివారణపై వలంటీర్లకు శిక్షణ

ఖైరతాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అన్ని సర్కిళ్ల ఉపకమిషనర్లు ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారించి పన్ను కట్టని వారితో కట్టించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పన్ను వసూళ్లు, శానిటేషన్, డెంగీ నివారణపై జెడ్సీ వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. ఇందులో ఉప కమిషనర్లు, వైద్యావిభాగం మెడికల్ అధికారులు, ఎంటమాలజీ అధికారులు, యూసీడీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే ఏర్పాట్లు చేయాలని, వాటిపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జగ్రత్తపడాలని కోరారు. ఎంటమాలజీ విభాగం వారు దోమల నిర్మూలనకు ప్రతిరోజూ కార్యస్థలాల్లో చేయాల్సిన విధులు నిర్వహించాలని కోరారు. సర్కిళ్ల ఉప కమిషనర్లు నాగేశ్వరరావు, శశిరేఖ, విద్యాసాగర్, జగన్, ప్రశాంతి ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాల పక్కనుంచి వెలుతూ ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్‌లో జరిగింది. నాంపల్లి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖైరతాబాద్ రైల్వే గేటు నుంచి లక్డీకాపూల్ రైల్వేస్టేషన్ వెళ్లే మార్గంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఓ వ్యక్తి చనిపోయాడని స్థానికులు రైల్వే గేటు కీపర్‌కు తెలపగా ఆయన రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ సంఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. మృతుడి గొంతు తెగినట్లు కనిపించగా అది హత్య అయి ఉండవచ్చుననే అనుమానంతో విచారించిన అనంతరం సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా మృతుడు మల విసర్జన కోసం పట్టాల పక్కనుంచి వెలుతూ చెప్పు జారి రైలును ఢీకొని ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మృతుడు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటాడని, కుడి చేతిపై లవ్ అని ఇంగ్లీష్‌లో పచ్చబొట్టు ఉన్నదని, ఎత్తు 5.6 అడుగులు ఉంటాడని పోలీసులు తెలిపారు.

రోడ్డు స్థలం ఆక్రమించి నిర్మాణం.. కూల్చివేసిన అధికారులు

ఎర్రగడ్డ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లోని సారధి నగర్‌లో రోడ్డు స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని అధికారులు సోమవారం కూల్చివేశారు. సారధినగర్‌లోని ప్లాట్ నంబర్ 30కి రెవెన్యూ అధికారులు క్లియరెన్స్ ఇచ్చి వారికి సంబంధించిన 215 గజాల స్థలంలో నిర్మాణాలు చేసుకోవచ్చని పర్మిషన్ ఇచ్చారు. ప్లాట్ నంబర్ 30కి పక్కన ఉన్న రోడ్డు స్థలాన్ని కూడా ఆక్రమించి నిర్మాణాలు జరుపుతుండడంతో శనివారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వచ్చి నిర్మాణాలను కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని వాటిని కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు.

సారధినగర్‌లో ప్లాట్ నంబర్ 30లో వారికి కేటాయించిన స్థలంలో కాకుండా రోడ్డును కూడా కబ్జా చేస్తున్నారని, అందుకే అక్కడ నిర్మాణాలను కూల్చివేసినట్లు ఆయన వివరించారు.



సారధినగర్‌లో రోడ్డు స్థలాన్ని ఆక్రమించిన నిర్మాణాన్ని కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది

ఉద్యోగుల కోసం అభ్యాస కేంద్రాన్ని ప్రారంభించిన పీడబ్ల్యూసీ

హైదరాబాద్ సిటీ, 22 జూలై (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల కోసం లెర్నింగ్ సెంటర్ (అభ్యాస కేంద్రం)ను సాధారణంగా ప్రతి కార్పొరేట్ సంస్థ తమ కార్యాలయాలలో ఏర్పాటు చేస్తున్నాయి. అవి పూర్తిగా అభ్యాసమే లక్ష్యంగా ఏర్పాటుచేసి ఉంటాయి కానీ, ఉద్యోగుల సంపూర్ణ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఏర్పాటైన అభివృద్ధి కేంద్రాలు అతి అరుదుగా ఉంటే, స్థానిక సంస్కృతి, సంప్రదాయలకు విలువనిస్తూనే, అణువణువూ ఆ వాతావరణం ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేసిన అభ్యాస కేంద్రం మాత్రం అరుదే! ఆ అరుదైన కేంద్రానికి నిలయంగా నిలిచింది ప్రైస్‌వాటర్ కూపర్ (పీడబ్ల్యూసీ) లెర్నింగ్ సెంటర్. పూర్తిగా గురుకుల అభ్యాస వాతావరణంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ తీర్చిదిద్దిన ఈ అభ్యాస కేంద్రాన్ని రాయదుర్గంలోని పీడబ్ల్యూసీ సెంటర్‌లో సోమవారం ప్రారంభించారు. మన పురాతన కాలం నాటి గురుకుల్ విద్యాబోధనను స్ఫూర్తిగా తీసుకుని, విద్యాపీఠ్ శీర్షిక న ఏర్పాటు చేసిన ఈ అభ్యాస కేంద్రం ద్వారా ఉద్యోగులలో నాయకత్వ అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రోత్సహించనున్నామని పీడబ్ల్యూసీ చైర్ పర్సన్ సంజీవ్ కృషన్ అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో దాదాపు 60 వేల



గురుకుల్ విద్యాబోధన మాదిరిగా ఏర్పాటు చేసిన లెర్నింగ్ సెంటర్

చదరపు అడుగుల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ కేంద్రం, పలు విధాలుగా ప్రత్యేకమైనదన్న ఆయన భారతదేశంలో తమ అతి పెద్ద లెర్నింగ్ సెంటర్‌లలో ఒకటని వెల్లడించారు. ఉద్యోగుల ఎదుగుదల పట్ల తమ నిబద్ధతను విద్యాపీఠ్ వెల్లడిస్తుందంటూ తొలి సంవత్సరంలోనే 10 వేల మంది ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

రుణం ఇప్పిస్తామని మోసం

- నలుగురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- నిందితులపై దేశవ్యాప్తంగా 425 కేసులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లోన్ ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన మనీష్‌కుమార్(24), ఆకాష్ కుమార్(24), కుందన్‌కుమార్(28), తెలంగాణకు చెందిన వెంకటేష్ మాన్‌జీ రాథోడ్ (21) ముఠాగా ఏర్పడి ప్రముఖ రుణ సంస్థల ప్రతినిధులమంటూ తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. రుణం కావాలని సంప్రదించిన వారి నుంచి జీఎస్‌టీ, ఎన్‌ఓసీ, పెనాల్టీ పేరుతో అందినకాడికి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారు. ధనీ ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్ సంస్థలో పనిచేస్తున్నామంటూ బహదూర్‌పురాకు చెందిన వ్యక్తికి రుణం ఇప్పిస్తామని నమ్మించారు. బాధితుడు రూ. 2లక్షల రుణం కావాలని కోరగా.. అతడి నుంచి ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్‌టీ, టీడీఎస్, ఎస్‌జీఎస్‌టీ, లేట్ పెనాల్టీ, క్లియరెన్స్, ఎన్‌ఓసీ, చెక్ క్లియరెన్స్ చార్జీలు, రీఫండబుల్ అమౌంట్ పేరుతో పలు దఫాలుగా బాధితుడి నుంచి రూ. 1,20,340 వసూలు చేశారు. బాధితుడు ఫోన్ చేయగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, ఎస్ఐ కె.సతీస్‌రెడ్డి బృందం ఢిల్లీ వెళ్లి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు నమోదయ్యాయని సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు.



తహసీల్దార్ అనితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి: ఓబీసీ మోర్చా

ఎర్రగడ్డ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని రాష్ట్ర ఓబీసీ మోర్చా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డికి నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు అనేక హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆరు నెలల్లో బీసీ కమిషన్ ఏర్పాటు చేసి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, యాదవులకు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గొర్రెల పంపిణీ సంబంధించి రెండు లక్షల రూపాయలు వారి అకౌంట్‌లో వేస్తామని వాగ్దానాలు చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటయి 8 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు గంగరాజు, ప్రేమ్ కుమార్, రవి యాదవ్, ఎస్ ఎల్ దీపక్ ముదిరాజ్, కొండపల్లి చంద్రమోహన్, సత్తిరాజు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, కృష్ణ, రాములు, సాయి, భాను తేజ, శివ తదితరులు ఉన్నారు.



వినియోగదారుల కాల్ రికార్డింగ్స్‌ను వింటున్న ఎండీ అశోక్‌రెడ్డి

ఎంసీసీని తనిఖీ చేసిన వాటర్‌బోర్డు ఎండీ

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని జలమండలి కస్టమర్ కేర్ సెంటర్ (ఎంసీసీ)ని ఎండీ అశోక్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వినియోగదారుల నుంచి వస్తున్న ఫోన్ కాల్స్ స్పందనను పరిశీలించారు. కొందరు వినియోగదారులతో స్వయంగా మాట్లాడారు. అలాగే కాల్ రికార్డింగ్స్‌ను విన్నారు. అనంతరం ఎండీ మాట్లాడుతూ సీవరేజి ఓవర్ ఫ్లో, రోడ్డుపై సిల్ట్, మ్యాన్ హోల్స్, నో వాటర్, లో ప్రెజర్ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎంసీసీలో సమస్య పరిష్కారమైన తర్వాత.. వినియోగదారులకు కచ్చితంగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. కాగా, జూన్‌లో 1,30,899 మంది ట్యాంకర్లు బుక్ చేసుకోగా, 1,86,251 ట్రిప్పులు డెలివరీ చేశారు. మొత్తం జూన్ నెలలో 75,555 ఫిర్యాదులు రాగా.. అందులో 75,496 సమస్యల్ని పరిష్కరించారు. కార్యక్రమంలో ఐటీ సీజీఎం టీవీ శ్రీధర్, ఐటీ సెల్ అధికారులు పాల్గొన్నారు.

పోలీసునని నమ్మించి బైక్‌తో ఉడాయించాడు

- ఎస్సార్‌నగర్‌లో బాధితుడి ఫిర్యాదు

అమీర్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పోలీసునని సహాయం చేస్తానంటూ నమ్మించి బాధితుడిని పోలీసుస్టేషన్ వరకు తీసుకువచ్చిన ఓ అగంతకుడు బైక్ తీసుకుని ఉడాయించాడు. ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలను పోలీసులు సోమవారం వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం, మంధర్న గ్రామానికి చెందిన కె.నిఖిల్(21) జీవనోపాధి కోసం నాలుగు రోజుల కిందట నగరానికి వచ్చాడు. స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా చేరాడు. ఆదివారం తెల్లవారు జామున నిఖిల్ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. అదే విచారంతో మైత్రీవనం బస్టాప్‌లో కూర్చుని ఆలోచిస్తుండగా గుర్తుతెలియని ఓ వ్యక్తి అక్కడికి వచ్చాడు. ఇబ్బంది పడుతూ ఎందుకు ఇక్కడ కూర్చున్నావని, తాను పోలీసునని సమస్య చెప్పమన్నాడు. తన మొబైల్ ఫోన్ పోయిందని నిఖిల్ చెప్పడంతో ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్తానని ఫిర్యాదు చేయమని సూచించాడు. నిఖిల్ బైక్‌పై వెనుక కూర్చున్న అగంతకుడు అతన్ని ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ వరకు తీసుకువెళ్లాడు. తాను బస్టాప్‌లో ఎదరు చూస్తున్న స్టేషన్ రైటర్‌ను తీసుకువస్తానని చెప్పి నిఖిల్ బైక్ తీసుకుని వెళ్లాడు. అప్పటికే అనుమానం వచ్చిన నిఖిల్ వేరొకరిని లిఫ్ట్ అడిగి అగంతకుడిని వెంబడించాడు. ఎస్సార్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద బైక్‌తో సహా అగంతకుడు అదృశ్యమయ్యాడు. దీంతో బాధితుడు తాను మోసపోయానని గ్రహించి తిరిగి ఎస్సార్‌నగర్ స్టేషన్ చేరుకుని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు అరెస్టు

- రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం

బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కోంపల్లిలో నివాసముంటున్న ఒడిస్సాకు చెందిన ఆశిష్ సర్దార్ అలియాస్ ఆశిష్, కృష్ణానగర్‌లో ఉంటున్న హన్మకొండ హంటర్ రోడ్డుకు చెందిన పసునాటి మణితేజ అలియాస్ మణి, హన్మకొండ రంగదర్వాజకు చెందిన యినల ముఖేష్ అలియాస్ ముఖేష్, బండ్లగూడకు చెందిన వెంకటసాయి అలియాస్ వెంకట్ డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని అనుకున్నారు. బాపీ సర్కార్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో అమ్మకాలు చేస్తున్నారు. వారు జూబ్లీహిల్స్‌లో ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరితో మరికొంత మంది గంజాయి అమ్ముతున్నట్టు విచారణలో తేలింది. నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళా జర్నలిస్ట్‌ను మోసం చేసిన వ్యక్తిపై కేసు

యూసుఫ్‌గూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మహిళా జర్నలిస్ట్ వద్ద నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాదగిరి గుట్ట ప్రాంతానికి చెందిన ఓ యువతి మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో నివాసం ఉంటూ జర్నలిస్ట్‌గా పని చేస్తుంది. సినిమాలపై ఉన్న ఆసక్తితో చిన్నచిన్న పాత్రలు చేస్తూ ఉంది. ఈ నేపథ్యంలో సత్య అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. సినిమా రంగానికి చెందిన వ్యక్తిగా పరిచయం అయిన సత్యతో స్నేహంగా ఉంటూ ఆ తరువాత అది ప్రేమగా మారింది. కొన్ని నెలల క్రితం సత్య తనకు డబ్బు అవసరం ఉందని త్వరలోనే తిరిగి ఇస్తానంటూ అడిగాడు. అతని ప్రేమలో ఉన్న ఆ యువతి రూ.50 వేలు ఇచ్చింది. ఆమె ఫోన్ కూడా తీసుకున్నాడు. వాటిని తిరిగి ఇవ్వాలని అడుగితే అదిగో ఇదిగో అంటూ కాలం గడుపుతున్నాడు. విసిగి పోయిన ఆమె ఈ నెల 19వ తేదీన ఫోన్ చేయగా ఓ మహిళ ఫోన్ తీసి సత్య నా భర్త నీవు ఎవరు ఎందుకు ఫోన్ చేస్తున్నావు అంటూ దుర్భాషలాడింది. వారిద్దరు కలిసి ఉన్న ఫోటోలు పంపింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన ఆ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నృత్యం చేస్తున్న భక్తులు



జాతరలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమ



పోతరాజుల విన్యాసం

వైభవంగా ఉజ్జయిని ఉత్సవం

సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు సోమవారం కూడా వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవారి దర్శనానికి తరలొచ్చి, మొక్కులను సమర్పించుకున్నారు. ఫలాహార బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి వివిధ రూపాల వేషధారణలతో నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువులతో లష్కర్ దద్దరిల్లింది. ఎటుచూసినా ఆధ్యాత్మికత ఉట్టిపడింది. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో భవిష్యవాణిని తిలకిస్తున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ఏఐసీసీ మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్ పవన్ ఖేరా, పీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు



ఓల్డ్ బోయిగూడ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఫలహార బండ్ల ఊరేగింపులో మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్ తదితరులు



ఉజ్జయినీ మహాకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు



బోనంతో వస్తున్న జోగిని శ్యామల



అగ్నితో విన్యాసం చేస్తున్న కళాకారుడు



ఆకట్టుకున్న అమ్మవారి వేషధారణలు



లష్కర్ జాతరలో ఫలహార బండి ఊరేగింపు

ఘనంగా గండిమైసమ్మ బోనాలు

రెజిమెంటల్‌బజార్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా రెజిమెంటల్‌బజార్‌లోని గండిమైసమ్మ బోనాల ఉత్సవాలను రెండోరోజూ వైభవంగా నిర్వహించారు. భక్తులు సోమవారం అమ్మవారిని దర్శించుకుని సాక, ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించారు. సాయంత్రం రంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసి భక్తిగీతాలు ఆలపిస్తుంటే భక్తులు డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, శ్రీను, నర్సింహాముదిరాజ్, నీలంకర్ తదితరులు పాల్గొన్నారు.



గండమైసమ్మ ఆలయం వద్ద ఫౌండర్, చైర్మన్ బాబురావు, గౌరీశంకర్, నందికంటి రవి తదితరులు



డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సినారె పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయులను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. సోమవారం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి 93వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు డా.సినారె పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి లక్ష్మీప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సినారె పురస్కారాన్ని ఆచార్య యార్లగడ్డకు అందజేయడం సముచితమైన నిర్ణయమని అన్నారు. తెలుగు భాష, సాంస్కృతిక వ్యాప్తికి సినారె, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ వేణుగోపాలచారి, ఎం.కె.రాము, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మార్కెట్‌యార్డు బోనాలు

బోయిన్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డులో బోనాల ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, మార్కెట్ యార్డు పాలకమండలి మాజీ సభ్యులు దేవులపల్లి శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఫలహారబండి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డు సభ్యులు, వ్యాపారులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహ, గట్టయ్య, ఎల్లయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఫోన్లను చోరీ చేస్తున్న ముగ్గురి అరెస్టు

రెజిమెంటల్‌బజార్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బోనాల జాతరలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు మహిళలను సోమవారం మార్కెట్ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఆదివారం బోనాలజాతరలో ఆర్పీరోడ్డు, మోండామార్కెట్ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లను చోరీ చేసినట్లు అనుమానించి, ముగ్గురు మహిళలను మార్కెట్ పోలీసులు తనిఖీ చేశారు. వారి నుంచి ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురికి సమాచారం అందించామని, మిగతా ఫోన్లు అన్‌లాక్ కాకపోవడం వల్ల సమాచారం అందించలేదని, కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



వట్టిపల్లి కోటేశ్వరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, స్కూల్ నిర్వాహకులు

విద్యాప్రధాత వట్టిపల్లి కోటేశ్వరరెడ్డికి నివాళి

బౌద్ధనగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యనందించి వారిని ఉన్నతస్థానాలకు తీసుకెళ్లిన విద్యాప్రధాత, అమరావతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు వట్టిపల్లి కోటేశ్వరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి స్కూల్ కరస్పాండెంట్లు కె.ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మి, కవితారెడ్డి, వీణారెడ్డి, దశరథ్‌తో పాటు పూర్వవిద్యార్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొన్ని వేలమంది నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను నేర్పించి, వారు ఉన్నతస్థానాలకు ఎదగటానికి తోడ్పడిన గొప్పవ్యక్తి కోటేశ్వరరెడ్డి అని పలువురు కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యాసంస్థలను నడుపుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

సర్దార్ పాపన్న మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

తార్నాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సర్దార్ పాపన్న మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డా.వట్టికూటి రామారావుగౌడ్ అన్నారు. సర్దార్ పాపన్న జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను సోమవారం జైగౌడ్ ఉద్యమం నాయకులు ఓయూ ఆర్ట్స్‌కాలేజీ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.రామారావుగౌడ్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలను ఆగస్టు 11న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైగౌడ్ ఉద్యమం రాష్ట్ర అధ్యక్షుడు మునుకుంట్ల శ్రీనివాస్‌గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి శేషగాని నరేష్‌గౌడ్, గాదగోని విమాలాగౌడ్, చాకన అనురాధగౌడ్, రంగోళ్ల మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జైగౌడ్ ఉద్యమం నాయకులు

మూసీ వెంట మురికివాడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి : ప్రొ. వినోద్‌కుమార్

తార్నాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మూసీ నది ప్రక్షాళన కోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని మురికివాడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓయూలోని లా కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చించి మూసీ నదిని ప్రక్షాళన చేయడానికంటే ముందు మురికివాడల్లో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. దీంతోపాటు స్థిర నివాసాలను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

8 మందికి రైల్వే ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్ అవార్డుల ప్రదానం

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో విధులు నిర్వహిస్తున్న 8 మంది ఉద్యోగులను ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపిక చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ చెప్పారు. సోమవారం సికింద్రాబాద్ రైలు నిలయంలో జరిగిన భద్రతా సమీక్షా సమావేశంలో ఎంపిక చేసిన ఉద్యోగులకు ఈ అవార్డులను అందజేశారు. వివిధ డివిజన్‌లలో రైల్వే సిబ్బంది వారి వారి విధి నిర్వహణలో చురుకుదనం, అంకితభావాన్ని ప్రదర్శించినందుకు ఈ అవార్డులను అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల నిర్వహణలో చిత్తశుద్ధి, నిబద్ధతకు అవార్డు గ్రహీతలను అభినందించారు. అనంతరం కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు, ఆరు డివిజన్ల (సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడు)కు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్‌లు (డీఆర్‌ఎంలు) పాల్గొన్నారు.

జింఖానాలో డ్రెస్సింగ్ రూమ్ ఆధునికీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధీనంలోని సికింద్రాబాద్ జింఖానా క్రికెట్ స్టేడియంలో మహిళల డ్రెస్సింగ్ రూమ్‌ను ఆధునికీకరించారు. మహిళా క్రికెటర్ల సౌకర్యార్థం డ్రెస్సింగ్ రూమ్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న ఎనిమిది చేంజింగ్ రూమ్స్‌కు మరమ్మతులు చేశారు. వీటిని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, అకాడమీ డైరెక్టర్ విజయ్ మోహన్ ప్రారంభించారు.

రూ. 2 లక్షల రుణం ఇస్తామని.. రూ. 1.20 లక్షలు కాజేశారు

- మోసాలకు పాల్పడుతున్న నలుగురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు
- ఢిల్లీలో అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లోన్ ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన మనీష్‌కుమార్(24), ఆకాష్ కుమార్(24), కుందన్‌కుమార్(28), తెలంగాణకు చెందిన వెంకటేష్ మాన్‌జీ రాథోడ్ (21) ముఠాగా ఏర్పడి ప్రముఖ రుణ సంస్థల ప్రతినిధులమంటూ తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. రుణం కావాలని సంప్రదించిన వారి నుంచి జీఎస్‌టీ, ఎన్‌ఓసీ, పెనాల్టీ పేరుతో అందినకాడికి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారు. ధనీ ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్ సంస్థలో పనిచేస్తున్నామంటూ బహదూర్‌పురాకు చెందిన వ్యక్తికి రుణం ఇప్పిస్తామని నమ్మించారు. బాధితుడు రూ. 2లక్షల రుణం కావాలని కోరగా, అతడి నుంచి ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్‌టీ, టీడీఎస్, ఎస్‌జీఎస్‌టీ, లేట్ పెనాల్టీ, క్లియరెన్స్, ఎన్‌ఓసీ, చెక్ క్లియరెన్స్ చార్జీలు, రీఫండబుల్ అమౌంట్ పేరుతో పలు దఫాలుగా బాధితుడి నుంచి రూ. 1,20,340 వసూలు చేశారు. బాధితుడు ఫోన్ చేయగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, ఎస్సై కె.సతీ‌ష్‌రెడ్డిల బృందం ఢిల్లీ వెళ్లి నిందితులను అరెస్ట్‌చేశారు. వారి నుంచి 11 ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు నమోదయ్యాయని సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు.

ఉచిత విద్యుత్ హామీ పథకం అమలు చేయాలి



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ హమాల్ బస్తీలో సోమవారం విద్యుత్ సిబ్బంది బకాయిలు వసూలు చేయడానికి వెళ్లగా ఉచిత విద్యుత్ హామీ అమలుచేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఐదారు నెలలుగా విద్యుత్ బిల్లులు చెల్లించని వారి ఇళ్లకి విద్యుత్ సరఫరా నిలిపివేయడానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బస్తీవాసులు, విద్యుత్ సిబ్బందికి మధ్య వాగ్వివాదం జరిగింది. సరఫరా నిలిపివేయడానికి వీళ్లేదని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రాసూరి సునీత మాట్లాడుతూ బస్తీలో నివాసం వుండే వారు నిరుపేదలని, కూలీనాలీచేసుకుని జీవనం సాగిస్తున్నారని, అందరూ ఉచిత విద్యుత్‌కు అర్హులేనని అన్నారు. దీంతో సిబ్బంది వెనుదిరిగారు.

దారిదోపిడీ కేసులో ముగ్గురికి ఏడాది జైలుశిక్ష

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వస్తున్న ప్రయాణికుడిని బెదిరించి దారిదోపిడీకి పాల్పడ్డ ముగ్గురు నిందితులకు సికింద్రాబాద్ రైల్వేకోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.200 నగదు జరిమానా విధించింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ చిలకలగూడ ప్రాంతానికి చెందిన చందు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ఫార్మసిస్టు. 2023 సెప్టెంబర్ 11న డ్యూటీ ముగించుకుని రాత్రి 9 గంటల సమయంలో ఎంఎంటీఎస్ రైలులో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగాడు. ప్లాట్ ఫాం నంబర్ 10 నుంచి ఇంటి వైపు వెళుతున్నాడు. ట్రాక్ సమీపంలో మూత్రవిసర్జనకు వెళ్లాడు. ఈ క్రమంలో ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ సోహెల్(25), చాంద్రాయణగుట్టకు చెందిన పవన్‌పవార్(23), మోహిదిపట్నానికి చెందిన మాణిక్య రమేష్(28)లు ముగ్గురూ కలిసి చందును బెదిరించి కత్తులతో దాడి చేశారు. చందు వద్ద ఉన్న బ్యాగులో డబ్బులు లేకపోవడంతో అతన్ని సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. ఈ క్రమంలో బాధితుడు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలలీసులకు ఫిర్యాదు చేశాడు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, రైల్వేకోర్టు కానిస్టేబుల్ కుమార్ నిందితులను కోర్టులో సోమవారం హాజరు పరిచారు. సికింద్రాబాద్ రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ ఎండీ గౌస్‌పాషా ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.200 జరిమానా విధించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య

బోయిన్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా బట్టిప్రోలు మండలం దాసరిపాలెం గరిగపూడి గ్రామానికి చెందిన సుధాకర్ బాబు(26) ఐదు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. గత సంవత్సర కాలంగా సుధాకర్‌బాబు న్యూబోయిన్‌పల్లి ఆర్మీ ప్రాంతంలోని సర్వత్రా లైన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ తన స్నేహితుడు చైతన్యతో కలిసి అక్కడే ఉంటున్నాడు. ఆదివారం 11 గంటల సమయంలో బయటకు వెళ్లి, ఇంటికి తిరిగివచ్చిన చైతన్య గదిలోకెళ్లి చూసేసరికి సుధాకర్‌బాబు నైలాన్ తాడుతో గది పైకప్పుకున్న ఇనుపరాడ్డుకు ఉరేసుకుని కనిపించాడు. దీంతో చైతన్య ఈ విషయం పోలీసులకు, మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు సోమవారం నగరానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే సుధాకర్‌బాబు మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు అతని సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.